ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
శుక్రవారం 11 ఏప్రిల్ 2025



రాహుల్, ప్రియాంక అలానే గెలిచారా..?
● ఈవీఎంలు మోసమంటూ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత సీటీ రవి 7

గ్రామం..దాహం..!



● నీటి ఎద్దడితో తల్లడిల్లుతున్న గ్రామాలు ● రాష్ట్రవ్యాప్తంగా 6వేల పల్లెల్లో కటకట ● 31 జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
● 5 జిల్లాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేసిన అధికారులు ● ప్రత్యేక గ్రాంట్లు కేటాయించని ప్రభుత్వం



బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు గ్రామాలు నీటిఎద్దడితో విలవిలలాడు తున్నాయి. వారానికి ఒకటి, రెండు సార్లు కూడా నీరు వచ్చేది కష్టంగా మారింది. పలు గ్రామాల్లో ట్యాంకర్లతో నీరు తరలించి గొంతు తడుపుతున్నారు. అయినా అరకొరగానే నీరందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే వేడిప్రభావం పెరిగింది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో పుష్కలంగా వర్షాలు కురిశాయి. చెరువులు, నదులు, సరస్సుల్లో నీరు చేరింది. అయితే డిసెంబరు నుంచే నీటిమట్టం తగ్గుతూ వచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లోనూ నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. నదులకు అనుబంధంలేని జిల్లాలతోపాటు ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో తాగునీటికి తల్లడిల్లే పరిస్థితి ఏర్పడింది. మార్చి మొదటివారం నుంచే రాష్ట్రంలో వేలాది గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. ఏప్రిల్ మొదటి వారమయ్యేసరికి ఈ ప్రభావం మరింత క్లిష్టంగా మారింది.



ఫలితాలివ్వని జలజీవన్ మిషన్

కేంద్రప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిలు సమకూర్చే పథకం అమలు చేసింది. 84శాతం ఇళ్లకు పైప్‌లు, కొళాయిలను అమర్చారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇప్పటివరకు దాదాపు 6వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ప్రాజెక్టు ప్రారంభంలో మంచి స్పందన కనిపించింది. అయితే పర్యవేక్షణ లేకపోవడం, బోర్లలో నీటిమట్టం తగ్గిపోవడం వంటి కారణాలతో పైపులు, కొళాయిలు వృథాగా మిగిలిపోయాయి. గణాంకాల్లో ఉన్న ప్రగతి వాస్తవంలో లేదని తెలుస్తోంది. నేతలు హడావుడి చేస్తున్నారే తప్ప ఫలితం లేదని వాపోతున్నారు.



6,400 గ్రామాల్లో విలవిల..

వేసవి ప్రభావం పెరగడంతో భూగర్భజలం అడుగంటిపోతోంది. బావులు, బోరుబావుల్లో నీటిమట్టం గరిష్ఠంగా తగ్గింది. దీంతో వేలాది బోరుబావులు నెలరోజుల్లోనే దాదాపు ఎండిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికోసం ప్రజలు రాత్రింబవళ్లు పడిగాపులు కాయక తప్పడం లేదు. కొన్ని గ్రామాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. త్రీఫేజ్ విద్యుత్ రాత్రివేళల్లో వస్తే వ్యవసాయ బోర్లనుంచి నీటిని తెచ్చుకునేందుకు వెళ్తున్నారు. అర్ధరాత్రి కూడా తాగునీటి కోసం వేచిచూడక తప్పడం లేదు. ఈ ఏడాది అత్యధిక వర్షాలు కురిసిన ప్రాంతాల్లోనూ నీటి ఎద్దడి కనిపిస్తోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోనూ తాగునీటి సమస్య గ్రామాలవారీగా ఉంది. ప్రస్తుతానికి 6,400కుపైగా గ్రామాల్ల నీటి సమస్య నెలకొంది. ప్రస్తుతానికి అత్యవసరంగా పది జిల్లాల్లో 26 తాలూకా పరిధిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

కరువు ప్రాంతాల ప్రకటన లేదు.. ప్రత్యేక గ్రాంట్లూ లేవు..

ఈ ఏడాది ఉత్తమమైన వర్షాలు కురవడంతో సాంకేతికంగా రాష్ట్రంలో కరువు ప్రకటించలేదు. కానీ గరిష్ఠమైన ఎండలతో రాష్ట్రమంతటా తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. ఎండవేడిమి తట్టుకోలేక ఉత్తర కర్ణాటక జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాల పనిగంటలల్లోనూ సవరణలు చేశారు. ఇంతటి పరిస్థితి ఉన్నా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా గ్రాంట్లు విడుదల చేయలేదు. పైగా కరువు మండలాలు ప్రకటించనందున ప్రత్యేకగ్రాంట్లు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. అత్యవసరంగా ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూరిస్తే గ్రామపంచాయతీలకు జనాభానుబట్టి 10లక్షలదాకా భారం అవుతోంది. ఇప్పటికే పంచాయతీలకు గ్రాంట్లు లేక ప్రత్యేకమైన పనులు చేపట్టలేకపోతున్నారు. ఇటువంటి తరుణంలోనే అదనంగా నీటిని సమకూర్చేందుకు రూ.5-10లక్షలదాకా భరించే పరిస్థితి లేదు. జలజీవన్ మిషన్ ద్వారా కూడా నీరు సరఫరా చేసే పరిస్థితి లేకుండాపోయింది. ప్రజలు నీటిని కొనుగోలు చేసే దారుణ పరిస్థితి ఏర్పడింది.
కేరళ రాష్ట్రంలో గత ఏడాది ఇదే తరహాలో తీవ్రమైన ఎండలు తలెత్తడంతో రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణ ద్వారా గ్రాంట్లను విడుదల చేశారు. ప్రస్తుతం తాగునీటి సమస్య గురించి అంచనా వేస్తున్నారు. ట్యాంకర్ల ఏర్పాటు, ప్రైవేట్‌బోర్లను అద్దె లేదా లీజుకు తీసుకునేందుకు జిల్లా అధికారుల ద్వారా ప్రయత్నాలు సాగుతున్నాయి. జిల్లా పంచాయతీ సీఈఓలు తాగునీటిపై అత్యవసర కార్యాచరణకు సిద్ధమయ్యారు.

31 జిల్లాల్లోనూ తాగునీటి సమస్య

31 జిల్లాల్లోనూ తాగునీటి సమస్య ఉంది. ఇప్పటివరకు 6,400 గ్రామాలను గుర్తించారు. ట్యాంకర్లను 1345 అందుబాటులో ఉన్నట్లు నిర్ధారించారు. ప్రైవేటు బోర్లు 3700 దాకా గుర్తించారు. వీటిని లీజుకు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రధానంగా తీవ్రమైన పరిస్థితి ఎదుర్కొంటున్న శివమొగ్గ జిల్లాలో 649 గ్రామాలు, హాసన్‌లో 581 గ్రామాలు, రాయచూరులో 512, మండ్య 473, ఉత్తరకన్నడ 411 గ్రామాలు ఉన్నాయి.

భూవివాదాలకు స్వస్తి పలకాలి

● రాష్ట్రవ్యాప్తంగా పక్కాగా భూసర్వే చేపట్టాలి
● రెవెన్యూ, సర్వే దినోత్సవ సభలో సీఎం సిద్దరామయ్య



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య, మంత్రి కృష్ణబైరేగౌడ

బెంగళూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైతులు అత్యధికంగా ఉన్నారని అయితే భూవివాదాలతో నిత్యం ప్రశాంతత కోల్పోతున్నారని, భూవివాదాలు లేని విధంగా సర్వేలు చేపట్టాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. విధానసౌధ తూర్పు ద్వారం ప్రాంతంలో రెవెన్యూ, సర్వే విభాగంల సంయుక్త ఆధ్వర్యంలో 36వ జాతీయ సర్వే దినోత్సవాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. రెవెన్యూశాఖ ప్రభుత్వానికి మాతృశాఖ లాంటిదన్నారు. రెవెన్యూశాఖ రైతులతో అనుబంధంగా పనిచేసే విభాగమన్నారు. ప్రజల కష్టాలను పరిష్కరించే శాఖగా కూడా రెవెన్యూకు పేరుందన్నారు. రానున్న రెండేళ్ళలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోనూ సర్వే పనులు పూర్తీ చేస్తామని భరోసా ఇచ్చారు. ఇటీవల ఏడాదిన్నరలో 26లక్షల సర్వేలు పూర్తీ చేశారన్నారు. కృష్ణబైరేగౌడ రెవిన్యూశాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. గణాంకాలను ఎప్పటికప్పుడు చెప్పేంతగా అవగాహన పొందారన్నారు. మంత్రి అంటే పరిణితి, ఆసక్తి రెండూ ఉండాలని అటువంటి వారే ఆయన అంటూ కొనియాడారు. రెండుసార్లు సీఎంగా రెవిన్యూశాఖకు సంబంధించిన ఉద్యోగుల పలు సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఖాళీగా ఉండే సర్వేయర్‌పోస్టులను భర్తీ చేస్తామని 1,227 మంది సర్వేయర్‌లను రెగ్యులర్ చేసే విషయమై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంలోనే రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ మాట్లాడుతూ శాస్త్రీయ విధానంగా సర్వే జరగాలని ప్రారంభం నుంచి చివరిదాకా కంప్యూటరీకరణ చేయదలచామన్నారు. కాలం మారినట్లుగానే ఆధునికతకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్, సీఎం రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి రాజేంద్రకుమార్ కటారియా, చీఫ్ విప్ అశోకపట్టణ, సర్వే విభాగం కమిషనర్ జె. మంజునాథ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి రెవెన్యూ, సర్వేవిభాగం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా..!

● వైభవంగా ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం





అలంకరణలో ప్రసన్న వెంకటరమణ స్వామి

దొమ్మసంద్ర, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన మాలూరు పరిధిలోని చిక్కతిరుపతిలో కొలువైన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. మూలవిరాట్టుకు విశేషపూజలు, అలంకరణలు చేశారు. ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం జరిగింది. మాలూరు ఎమ్మెల్యే నంజేగౌడ, మాజీ ఎమ్మెల్యే మంజునాథ్‌గౌడ, మాజీ ఎంపీ మునిస్వామి, ఆలయ ఈఓ సెల్వమణి తదితరులు రథోత్సవాన్ని ప్రారంభించారు. సరిహద్దు ప్రాంతం కావడంతో స్థానికులే కాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● ముగ్గురు కర్ణాటకవాసులకు గాయాలు

పెనుకొండరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో కర్ణాటకకు చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి జరిగింది. శిడ్లఘట్టకు చెందిన సిల్క్ వ్యాపారులు మహేష్, మధు, శ్రీనివాసులు కారులో ధర్మవరానికి వచ్చి స్వస్థలానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను 108లో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.





ప్రమాదంలో దెబ్బ తిన్న కారు



అధ్వానంగా అశోకచక్ర స్థూపం



పార్కులో పేరుకుపోయిన చెత్త



నీరు లేని ఫౌంటెయిన్

ఫ్రీడంప్ పార్క్..!

నగరంలో ఏ విధమైన ఆందోళనలు, నిరసనలు అయినా ఫ్రీడం పార్కులో మాత్రమే నిర్వహించాలనే నిబంధనలు ఉన్నాయి. అధికార పార్టీ, ప్రతిపక్షం, ప్రభుత్వ, ప్రైవేటు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రజాసంఘాల ఆందోళనలు ఎన్నో ఇక్కడ జరిగాయి. ఎందరి సమస్యలనో ఇక్కడ పరిష్కరించిన పార్క్ మాత్రం తన సమస్యను పరిష్కరించు కోలేకపోతోంది. ప్రతి రోజూ కనీసం ఐదారునుంచి పదుల సంఖ్యలో ప్రజాసంఘాల ఆందోళనలు ఇక్కడ జరుగుతుంటాయి. అటువంటి ప్రాంతంలో ఎక్కడ చూసినా దుర్గంధం, చెత్తాచెదారం కనిపించడం సర్వసాధారణం అయ్యింది. ఫ్రీడం పార్కులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అశోకచక్ర స్థూపం చెత్తాచెదారంతో నిండిపోయింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారింది. రూ.కోట్లలో పన్నులు వసూలు చేసే అధికారులు పార్కులపై శ్రద్ధ చూపలేరా అంటూ మండిపడుతున్నారు.

అంతరించిపోతున్న నీటికుక్కలు..!

● కశ్మీర్, అసోం తర్వాత తుంగభద్రలోనే అధికం ● అరుదైన జాతి రక్షణపై దృష్టిపెట్టని అధికారులు



తుంగభద్రలో నీటికుక్కలు (ఫైల్)

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అరుదైన నీటికుక్కల సంరక్షణలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దేశంలో కాశ్మీర్, అస్సాం తరువాత దక్షిణ భారత దేశంలోని తుంగభద్ర నదిలోనే అతి ఎక్కువగా నీటికుక్కల సంచారం ఉన్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తుంగభద్ర నది సుమారు 40 కిలోమీటర్ల దూరాన్ని నీటి కుక్కల సంరక్షణ ప్రాంతంగా ప్రకటించి దశాబ్దం గడుస్తున్నా... ఇంత వరకు ఆటి సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. దీంతో క్షీణిస్తున్న వాటి సంతతిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చేపలు పట్టడాన్ని నిషేదించడంతో పాటు నదీతీర ప్రాంతాల్లో వరిపైరుకు వాడే రసాయన మందులు తుంగభద్ర నదిలో కలవడం, చుట్టుపక్కల వ్యర్థాలు చేరడంతో ఏటా నీటి కుక్కల సంతతి తగ్గుతున్నాయని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.

నీటి కుక్కల రక్షణ చర్యలేవీ?

రాష్ట్ర ప్రభుత్వం 2015 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కొప్పళ తాలూకా హొలె ముద్లాపురం నుంచి బళ్ళారి జిల్లా పరిధిలోని కంప్లి వరకు ఉన్న నదీతీర ప్రాంతాన్ని నీటి కుక్కల సంరక్షణ ప్రాంతంగా ప్రకటించింది. బళ్ళారి, విజయనగర, కొప్పళ జిల్లాల అటవీ శాఖ మూడు జిల్లాల పరిధిలోని సుమారు 40కిలోమీటర్ల ప్రాంతాన్ని నీటి కుక్కల సంరక్షణ ప్రాంతంగా ప్రకటించింది. అయితే ఇప్పటి రాష్ట్ర ప్రభ్వుత్వం అవసరమైన ప్రణాళికలు ఏవీ రూపొందించ లేదని అధికారులు అసహనం వ్యక్తం చేస్తుండడం విశేషం.



నది ఒడ్డున నీటి కుక్క

సంరక్షణ తప్పనిసరి: కావ్య చతుర్వేది, సీఎఫ్ఓ

అటవీశాఖ ఆద్వర్యంలో ప్రతి యేటా మే 31వ తేదీన నీటికుక్కల దినోత్సవాన్ని ఆచరిస్తూ వస్తోందని కొప్పళ జిల్లా సీఎఫ్ఓ కావ్య చతుర్వేది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో పులికి ఎంత ప్రాధాన్యం ఉందో... నీటిలో సంచరించే అపురూపమైన నీటి కుక్కలకు అంతే ప్రాధాన్యం ఉందన్నారు. మానవ తప్పిదాల కారణంగానే వాటి సంతతి తగ్గుతోందన్నారు. తుంగభద్ర నది పరివాహక ప్రాంతాలైన కుడి, ఎడమ భాగాల్లో సుమారు 34కిలోమీటర్ల వ్యాప్తిలో నీటికుక్కల మనకు కనిపిస్తుంటాయని, నీరు స్వచ్ఛత లేని కారణంగా అవి ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. నీటి కుక్కలకు జరిగే ప్రమాదాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని, సంరక్షిత ప్రాంతంగా మాత్రంగా ప్రకట వరకే పరిమితమైందని, ఇలాంటి అపురూపమైన నీటి కుక్కల సంరక్షణకు అవసరమైన పథకాలు రూపొందించాలన్నారు.

బండమీదపల్లి.. పాడిలో మేటి



బండమీదపల్లిలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు



పాడి ఆవులు

రోజూ 8 వేల లీటర్లు డెయిరీకి సరఫరా
జిల్లాలోనే అత్యధికంగా పాల ఉత్పత్తి
ఎక్కువ మందికి జీవనాధారం

ఒకప్పుడు ఆ గ్రామంలో అందరికి వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడం, దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు నష్టాలే మిగిలేవి. ఈ నేపథ్యంలో రైతులు పాడి పెంపకంపై దృష్టి సారించారు. వ్యవసాయంతో పాటు పాడి పశువులను పోషించడం ప్రారంభించారు. కష్టానికి తగిన ఫలితం లభిస్తుండడంతో రైతులు, రైతు కూలీలు పాడినే జీవనాధారం చేసుకున్నారు. రాప్తాడు మండలం బండమీదపల్లి రైతులు పాల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా డెయిరీలకు పాలు సరఫరా చేస్తున్నారు.

రాప్తాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో ఆదర్శంగా నిలుస్తున్నారు రాప్తాడు మండలంలోని బండమీదపల్లి రైతులు. ఈ గ్రామం అనంతపురం జిల్లా కేంద్రానికి 30 కిలో మీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో వెయ్యికిపైగా కుటుంబాలు, 4వేలకు పైగా జనాభా ఉంది. గ్రామంలో అందరూ రైతులు, రైతు కూలీలే. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వేరుశనగ, వరి, చీనీ, కంది తదితర పంటలు సాగు చేసేవారు. కాలక్రమేణా వ్యవసాయం భారం కావడంతో రైతులు పాడి పశువుల పెంపకంపై ఆసక్తి చూపారు. తమకున్న పొలంలో కొంత భాగం పశుగ్రాసం సాగు చేసుకుని మేతగా ఉపయోగిస్తున్నారు. తర్వాత చాలా మంది పాడి వైపే మొగ్గుచూపారు. హిందూపురం, పుంగనూరు, చింతామణి, కర్ణాటకలోని వేర్వేరు ప్రాంతాల నుంచి మేలు జాతి జెర్సీ ఆవులను కొనుగోలు చేసి జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. ఒక్కో కుటుంబానికి రెండు నుంచి 10 పాడి పశువులు ఉన్నాయి. కొంత మంది 15 ఆవులను పోషిస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ కష్టపడి పని చేస్తూ కష్టానికి తగిన ప్రతి ఫలం పొందుతున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాలు పిండి గ్రామంలోని డెయిరీలకు పోస్తున్నారు. ఏజెంట్లు రైతుల నుంచి సేకరించిన పాలను జిల్లాలోని పలు ప్రైవేటు డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో ప్రస్తుతం 1300కు పైగా పాడి పశువులు ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 4 వేల లీటర్లు, సాయంత్రం 4 వేల లీటర్లు మొత్తం 8 వేల లీటర్ల పాలు గ్రామం నుంచి డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా బండమీదపల్లి నుంచి పాలు సరఫరా అవుతున్నాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పాల నాణ్యతను బట్టి లీటరు ఆవు పాలకు రూ. 30 నుంచి రూ.36 రైతులకు చెల్లిస్తున్నారు. డెయిరీ ఏజెంట్లు రైతులకు 15 రోజులకు ఒకసారి బిల్లు అందచేస్తారు.



సాగుచేసిన పశుగ్రాసం

పాడి పశువులే జీవనాధారం



మాకు 10 పాడి పశువులు ఉన్నాయి. వరిగడ్డి, వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి పశువులను పోషిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పశువుల వద్దే ఉంటూ జాగ్రత్తగా కాపాడుకుంటున్నాం. గ్రామంలో పశువైద్యశాల ఉండటంతో సకాలంలో వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. ప్రతి రోజూ 80 లీటర్ల పాలు డెయిరీకి సరపరా చేస్తున్నాం. -నరసింహులు, రైతు, బండమీదపల్లి

ప్రభుత్వం చేయూత

ప్రభుత్వం పాడి రైతులకు చేయూతనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత దాదాపు 10 గోకులం షెడ్లు మంజూరు చేయించారు. 2024లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా బండమీదపల్లికి అత్యధికంగా 24 గోకులం షెడ్లు మంజూరు చేశారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 లక్షలు మంజూరు చేస్తోంది. బ్యాంకులు కూడా పాడి పశువులకు రుణాలు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఇటువైపు మొగ్గు చూపుతున్నారు.

రోజుకు 140 లీటర్ల పాలు పోస్తున్నాం



మాకు 14 పాడి పశువులు ఉన్నాయి. కుటుంబ సభ్యులందరం కష్టపడి పని చేస్తున్నాం. రెండు ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేశాం. ప్రతి రోజూ ట్రాక్టర్‌లో పశుగ్రాసం కోసుకుని వచ్చి ఆవులకు మేతగా వేస్తాం. ఉదయం 70 లీటర్లు, సాయంత్రం 70 లీటర్లు మొత్తం రోజుకు 140 లీటర్ల పాలు డెయిరీకి పోస్తున్నాం. -గోవిందు, రైతు, బండమీదపల్లి

గోకులం షెడ్డు నిర్మించుకున్నాం



వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంకం చేపడుతూ జీవనం సాగిస్తున్నాం. మాకు నాలుగు ఆవులు ఉన్నాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోకులం షెడ్డు మంజూరైంది. షెడ్డు నిర్మించుకుని పశువులు పోషిస్తున్నాం. పాడి పశువులకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగకరం. -కదిరప్ప, రైతు, బండమీదపల్లి

సకాలంలో వైద్యసేవలు

గ్రామంలో పాడి పశువులు ఎక్కువగా ఉన్నాయి. పశువులకు జ్వరం, పొదుగు వాపు, ఇతర వ్యాధులు సోకితే రైతులు వెంటనే పశువైద్యశాలకు తీసుకువస్తున్నారు. పశువులకు టీకాలు వేసి వ్యాధులు నయం చేస్తున్నాం. గాలికుంటు వ్యాధి టీకాలు, ఎద టీకాలు సకాలంలో వేస్తున్నాం. పాడి పశువులకు బీమా కూడా చేస్తున్నాం.
-సోమేశ్వరి, పశువైద్యాధికారి, బండమీదపల్లి

రైతులకు ప్రభుత్వం చేయూత



రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు సబ్సిడీపై గోకులం షెడ్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు అందిస్తోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువ ద్వారా ప్రతి ఏటా బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామంలో రైతులు వ్యవసాయం, పాడి పశువులు పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. -శ్రీనివాసులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, బండమీదపల్లి

నత్తకు నడకలు నేర్పేలా..

ఏళ్లుగా సాగుతున్న తాగునీటి పథకం పనులు
భారీగా పెరిగిన అంచనా వ్యయం
ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులే..!

అర్ధంతరంగా ఆగిన ట్యాంకు నిర్మాణం



మడకశిర, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు మున్సిపాల్టీల పరిధిలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వేసవిలో తాగునీటి సమస్యలు తప్పేలా లేవని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లుగా ..

ఐదు మున్సిపాల్టీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం కాంప్రహెన్సివ్ వాటర్‌సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఇందులో మడకశిర పట్టణానికి రూ.63కోట్ల నిధులు మంజూరు చేశారు. ఏఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా 70 శాతం, ప్రభుత్వం నుంచి 30 శాతం నిధులతో ఈపనులు జరుగుతున్నాయి. పనులు రెండేళ్లలో పూర్తి కావాల్సి ఉంది. కానీ అలా జరగకపోవడంతో మరో రెండేళ్లు పొడిగించారు. అయినా ప్రయోజనం లేదు. మడకశిర సమీపంలోని చెరువులో సంపు, ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటి వరకు 30 శాతం పనులే జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మడకశిర చెరువులో సంపు ఏర్పాటుచేసి, అక్కడ నుంచి పక్కనే ఉన్న గుట్టపై వాటర్‌ప్లాంటు నిర్మించి, అక్కడ నీటిని శుద్ధిచేసి మెళవాయి వద్ద నిర్మించిన ట్యాంకుకు పైపుల ద్వారా నీటిని సరఫరా చేసి, అక్కడ నుంచి పట్టణానికి రోజూ నీటిని అందించనున్నారు. పట్టణంలో ఏడు ట్యాంకులను నిర్మిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో 7లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, ఎస్సీ కాలనీలో 5లక్షల లీటర్లు, పావగడ రోడ్డు సమీపంలో 6లక్షల లీటర్లు, బేగార్లపల్లి, మారుతీనగర్, గొల్లహట్టి, మల్లినాయకనపల్లిలో ఒక్కొక్కచోట 3లక్షల లీటర్ల సామర్థ్యంగల ట్యాంకులను నిర్మిస్తున్నారు.

పెరిగిన వ్యయం

ఉమ్మడి జిల్లాలోని పామిడి, మడకశిర, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, గుత్తి మున్సిపాల్టీల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇవ్వడానికి కాంప్రహెన్సివ్ వాటర్ సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం ద్వారా రూ. 545 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడిచినా నేటికి 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో నిర్మాణ వ్యయం రూ.545 కోట్ల నుంచి రూ.628 కోట్లకు పెరిగింది. ఈక్రమంలో ప్రస్తుతం ఉన్న ఎస్‌ఆర్ రేట్ల ప్రకారం అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా రు. ఇప్పటి వరకు అన్ని చోట్ల ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణపు పనులు ప్రారంభం అయ్యి వివిధ దశలలో ఉన్నాయి. సకాలంలో నిధులు విడు దల కాకపోవడం,




ప్రారంభంలో కరోనా కారణంగా పనులు నత్తనడకన సాగాయి. దీంతో నిర్మాణ వ్యయం 15శాతానికి పైగా పెరిగింది. తాగునీటి పథకం పనులు పూర్తి అయ్యేందుకు మడకశిర మున్సిపాల్టీకి రూ.73 కోట్లు, పుట్టపర్తి మున్సిపాల్టీకి రూ.117 కోట్లు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి కొత్తగా ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇప్పటిదాకా చేసిన పనుల బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం రూ.14కోట్లు చెల్లించింది. ఇంకా మడకశిర, పుట్టపర్తి మున్సిపాల్టీలలో జరిగిన పనులకు సంబంధించి రూ.ఐదు కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది. పామిడి నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మారడంతో అక్కడ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం: ఆదినారాయణ, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి

రెండు వారాల్లో తాగునీటి పథకానికి సంబంధించిన టెండర్లు పిలుస్తాం. ఇప్పటికి 20 శాతం దాకా పనులు పూర్తి అయ్యాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు పామిడి, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి మున్సి పాల్టీలకు తాగునీటి పథకానికి రూ.545 కోట్లదాకా నిధులు మంజూరయ్యాయి. అందులో రూ.19 కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు 14 కోట్ల దాకా చెల్లించాం. ఇంకా 5 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే ఆ బిల్లులు కూడా చెల్లిస్తాం.


25 శాతం లోపు పనులు జరిగిన వాటిని రద్దు చేస్తూ, చేపట్టవలసిన పనులకు అంచనాలు వేసి రూ.628 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

పండుటాకులకు అండ



GOVERNMENT OF ANDHRA PRADESH
Dept.for the welfare of Differently Abled, Transgenders & Senior Citizens, Ananthapuramu Dist
IDENTITY CARD FOR SENIOR CITIZENS
Regn.No. Date :
Name :
Father / Husband :
Date of Birth & Age :
Aadhar No. :
Assistant Director
Welfare of Differently Abled, TG & SC, Ananthapuramu Dist

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు ముందు భాగం



Address :
Phone / Cell No. :
In Case of Emergency, Contact Name :
Phone / Cell No. :
Blood Group
Occupation
Signature of Card Holder

సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు వెనుకభాగం

- ఎస్‌సీఐడీ కార్డుతో ఎన్నెన్నో ప్రయోజనాలు
- బస్సు, రైలు టిక్కెట్‌పై రాయితీ
- బ్యాంకుల్లో ఎఫ్‌డీలపై అధిక వడ్డీ రేట్లు
- దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలకు అవకాశం
- ప్రభుత్వ పింఛన్ పొందే అవకాశం
- దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోపే మంజూరు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పండుటాకులకు కొత్త ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి పథకాలు వర్తింపజేసే దిశగా వయోవృద్ధుల గుర్తింపు (ఎస్‌సీఐడీ) కార్డు మంజూరును సులభతరం చేసింది. మాన్యువల్‌గానూ కార్డు అందజేస్తోంది. అంతేకాదు, దరఖాస్తు చేసుకున్న రెండ్రోజుల్లోపే కార్డు మంజూరు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వం పింఛన్ అందిస్తోంది. వీటితోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు, సేవలను వినియోగించుకునేందుకు ఎస్‌సీఐడీ కార్డును ప్రవేశపెట్టింది. 60 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ ఈ కార్డుకు అర్హులు. ఈ కార్డు పొందిన వృద్ధులకు బస్సు, రైలు టిక్కెట్ ధరల్లో 40 శాతం వరకు తగ్గింపు, దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు, ఎఫ్‌డీ ఖతాలపై అధిక వడ్డీ రేట్లు, ప్రభుత్వ పింఛన్ పొందని వారికి ఈ ఐడీ కార్డు ఆధారంగా అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. జిల్లావ్యాప్తంగా 6 లక్షలకుపైగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులున్నట్లు సమాచారం. వీరిలో ఇప్పటికే 5 లక్షలకు



విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయం

పైగా వృద్ధులు ప్రభుత్వ పింఛన్ పొందుతున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇంకా వేల సంఖ్యలో వృద్ధులు ప్రభుత్వ పింఛన్‌తోపాటు.. కార్డు ద్వారా అందే సేవలకు దూరంగా ఉన్నారనే చెప్పాలి. వీరందరికీ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్డుతో వృద్ధులకు సంక్షేమ పథకాలు, సేవలు మరింత సులభతరంగా అందే అవకాశాలున్నాయి వారు పేర్కొంటున్నారు.

టిక్కెట్ ధరల్లో తగ్గింపు...

ఎస్‌సీఐడీ కార్డుతో ఆర్టీసీ బస్సులు, రైలు ప్రయాణాల్లో టిక్కెట్ ధరల్లో తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డు పొందిన వయోవృద్ధులు బస్సులు, రైలులో ప్రయాణించే సమయంలో టిక్కెట్ ధరల్లో 40 శాతం వరకు తగ్గింపు వర్తిస్తుంది. రాష్ట్రమంతా ఏ జిల్లాకు వెళ్లాలన్నా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆరోగ్య పరిస్థితులు క్షీణించిన వృద్ధులకు సహాయకులుగా ఉన్న వ్యక్తులకు సైతం బస్సు, రైలు ప్రయాణాల్లో ఈ ధరలు వర్తింపజేసింది. బ్యాంకుల్లో ఎఫ్‌డీ ఖాతాలు కలిగిన వయోవృద్ధులకు 5 నుంచి 6 శాతం వడ్డీ రేట్ల పెంపునకు అనుమతులిచ్చింది.

దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు

దేవాలయాల్లో పూజలో పాల్గొనాలంటే... సాధారణ ప్రజలకే కష్టంతో కూడుకున్న పని. పండుగ రోజులు, ప్రత్యేక దినాల్లో క్యూలైన్లో గంటల తరబడి నిలబడాల్సి వస్తుంది. ఇక వృద్ధుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలోనే ఎస్‌సీఐడీ కార్డుతో దేవాలయాల్లో వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించే వెసులుబాటు కల్పించింది. కార్డు కలిగిన వృద్ధులు క్యూలైన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా.. వారికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. ఆ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

కార్డు ఆధారంగా పింఛన్...

ఎస్‌సీఐడీ కార్డుతో రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్ నేరుగా పొందే అవకాశం కల్పించింది. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు ఈ ఐడీ కార్డు ఆధారంగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. గతంలో పింఛన్ కోసం సచివాలయాలు, ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకునేందుకు వృద్ధులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ ఐడీ కార్డు కలిగిన వృద్ధుల్లో ఎవరికైనా ప్రభుత్వ పింఛన్ అందకపోతే.. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారుల సిఫార్సు లేఖతో పొందే అవకాశం ఉంటుంది.

రెండ్రోజుల్లోపే...

సీనియర్ సిటిజన్ ఐడీ కార్డును వృద్ధులు ఈజీగా పొందవచ్చు. 60 సంవత్సరాలు పైబడినట్లు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌గానీ, పాన్ నంబర్‌గానీ, స్కూల్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. ఫొటోలతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలి. దరఖాస్తు అందజేసిన రెండ్రోజుల్లోపే సీనియర్ సిటిజన్స్ ఐడీ కార్డును దరఖాస్తుదారులకు అందజేస్తారు.

వృద్ధులు కార్డును ఉపయోగించుకోవాలి



ఉమ్మడి జిల్లాలో 60 ఏళ్లపైబడిన వృద్ధులందరూ సీనియర్ సిటిజన్స్ ఐడీకార్డును పొందాలి. ఈ కార్డు ద్వారా అనేక పథకాలు, సేవలను పొందవచ్చు. ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 మందికిపైగా కార్డును పొందారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అర్హత కలిగిన వృద్ధులు కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తే... రెండ్రోజుల్లోపు కార్డు మంజూరు చేస్తాం.
- వినోద్, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ



రాసిగా పోసిన నిమ్మకాయలు

నిమ్మ ధర పైపైకి..

ఎండల ప్రభావంతో పెరిగిన రేట్లు
దిగుబడి లేకపోవడమూ కారణమే
మే నెలలో మరింత పెరిగే అవకాశం

పుట్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవి నిమ్మ రైతులకు బాగా కలిసొస్తోంది. ఎండలు మండిపోతుండడంతో నిమ్మకు డిమాండ్ పెరిగింది. దిగుబడి కూడా లేకపోవడంతో ధరలు పైపైకి చేరుతున్నాయి. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.4500 నుంచి రూ.4800 వరకు పలుకుతోంది. మండలంలోని పుట్లూరు, పి.చింతలపల్లి, సూరేపల్లి, నాయకునిపల్లి, బాలాపురం, మడ్డిపల్లి, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి తదితర గ్రామాల పరిధిలో నిమ్మపంటను 250 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గిపోవడంతోనే ధరలు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి లేదని తెలుస్తోంది.

మూడు నెలలే కీలకం..

నిమ్మపంట విక్రయించాలంటే ఏడాదిలో మూడునెలలే కీలకమని రైతులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ పంట ధరలకు రెక్కలు వస్తాయని రైతులు తెలిపారు. ఏడాది పొడవునా పంట దిగుబడి తీసినా ఆశించిన ధరలు ఉండవు. వేసవి ప్రారంభం కావడంతోనే ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది జనవరిలో ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.600 ఉండగా, ఫిబ్రవరి వచ్చేసరికి ఏకంగా రూ.1500కి పెరిగింది. మార్చిలో రూ.2500కి చేరుకుంది. ప్రస్తుతం రూ.4500 నుంచి రూ.4800 వరకు ధర ఉంటోంది. మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు వంద చెట్లు సాగుచేస్తే దిగుబడి 100 నుంచి 150 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తోంది. సాధారణంగా ప్యాకెట్‌కు సైజును బట్టి 800 నుంచి 1,200 నిమ్మకాయలను లోడ్ చేస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యతగా ఉండడంతో ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ ప్రాంతంలో పండిన నిమ్మకాయలను గోవా, కేరళ, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



నిమ్మచెట్లు

ధర ఆశాజనకంగా ఉంది..

ఈ ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఐదెకరాల్లో పంట సాగు చేశా. ఏడాది ప్రారంభంలో ధర అంతంతమాత్రంగానే ఉండేది. నెలరోజుల నుంచి పెరుగుతూ వస్తోంది. తక్కువ ధర ఉన్నపుడు 200 ప్యాకెట్లుపైగానే విక్రయించా. ధర పెరిగినపుడు ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఈ ధర ఇలాగే కొనసాగితే నిమ్మరైతుల కష్టాలు తీరినట్లే.



- రమేష్‌నాయుడు, రైతు, సూరేపల్లి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కస్తూర్బా గాంధీ (జయంతి)



కస్తూర్బా గాంధీ 1869 ఏప్రిల్ 11న గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్‌లో జన్మించారు. భర్త మహాత్మా గాంధీతో కలసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా ప్రవాస భారతీయ జీవన పోరాటంలోనూ పాల్గొన్నారు. కులమత భేదాలు లేకుండా స్వాతంత్ర్యపోరాటంలో పురుషులతో సమానంగా పాల్గొనాలని మహిళలకు పిలుపునిచ్చారు. నిరాహార దీక్ష, ఇతర సందర్భాలలో భర్తతోపాటు ఆమె కూడా పలుమార్లు అరెస్టు అయ్యారు. స్వాతంత్ర్యం రాక మునుపే 1944 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

కేఎల్ సైగల్ (జయంతి)



కుందన్‌లాల్ సైగల్ 1904 ఏప్రిల్ 11న జమ్మూలో పంజాబీ కుటుంబంలో జన్మించారు. గాయకుడు, నటుడు. హిందీ సినీరంగంలో తొలి సూపర్‌స్టార్ ఆయనే. గాయకుడిగా తనదైన శైలిలో రాణించారు. ఆయన బాటలోనే మొహమ్మద్ రఫి, లతా మంగేశ్కర్, కిశోర్‌కుమార్, ముకేశ్ తదితరులు సాగారనడంలో అతిశయోక్తి లేదు. 15ఏళ్ల కెరీర్‌లో 36 సినిమాలలో నటించి 185 పాటలు పాడారు. భజనలు, గజల్స్ పాటలు సైతం ఆలపించారు. 1947 జనవరి 18న కన్నుమూశారు.

డాక్టర్ పియర్స్ సెల్లెర్స్ (జయంతి)




బ్రిటీష్ - అమెరికన్ వాతావరణ శాస్త్రవేత్త పియర్స్ జాన్ సెల్లెర్స్ 1955 ఏప్రిల్ 11న ఇంగ్లండ్ దేశం క్రోబరో ప్రాంతంలో జన్మించారు. నాసాలో పేరొందిన వ్యోమగామిగాను, డైరెక్టర్‌గాను వ్యవహరించారు. మూడు స్పేస్ షటిల్ మిషన్స్‌లో పాల్గొన్నారు. 2011లో నాసా ఆస్ట్రోనాట్ కార్ప్స్ నుంచి రిటైరయ్యారు. ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ (ఓబీఈ)గా ఇతర హోదాలలోనూ కొనసాగి పలు అవార్డులు పొందారు. 2016 డిసెంబరు 23న కన్నుమూశారు.

రామనాథన్ క్రిష్ణన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత రామనాథన్ క్రిష్ణన్ 1937 ఏప్రిల్ 11న తమిళనాడు రాష్ట్రం నాగర్‌కోయిల్ ప్రాంతంలో జన్మించారు. 1950-60లలో టెన్నిస్ క్రీడాకారుడిగా రాణించారు. 1954లో యువకుల సింగిల్స్‌లో వింబుల్డెన్ టైటిల్‌ను సాధించిన ఆసియా క్రీడాకారుడు. 1960, 61లలో రెండుసార్లు వింబుల్డెన్‌లో సెమీ ఫైనల్స్ వరకు ఆడారు. వరల్డ్ నెంబరు 6 ర్యాంకింగ్ గుర్తింపు పొందారు. తనదైన క్రీడాశైలితో 'టచ్ టెన్నిస్'గా రాణించారు. 1953-75 మధ్య డేవిస్ కప్‌లో ప్రాతినిధ్యం వహించారు. ఆలిండియా ఛాంపియన్స్ ఆరుసార్లు కైవశం చేసుకున్నారు. పద్మశ్రీ, అర్జున అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు.

భారతీ తీర్థ మహాస్వామి (పుట్టినరోజు)



జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి 1951 ఏప్రిల్ 11న మచిలీపట్నం ప్రాంతంలో జన్మించారు. పూర్వాశ్రమంలో ఆయన పేరు సీతారామ ఆంజనేయులు. కర్ణాటక రాష్ట్రం చిక్కమగళూరు జిల్లాలోని శృంగేరీ శారదా పీఠం 36వ పీఠాధిపతిగా కొనసాగుతున్నారు. వేదాలను శాస్త్రాలను ఔపోసన పట్టారు. అభినవ విద్యాతీర్థ స్వామిజీ తర్వాత శృంగేరీ శారదా మఠం బాధ్యతలు స్వీకరించారు. గురువు ఆదిశంకరాచార్యుల బాటలో అద్వైత సిద్ధాంతాలతోపాటు సనాతన ధర్మ ఉద్ధరణకు కృషి చేస్తున్నారు.

బాబ్ హారిస్ (పుట్టినరోజు)



బీబీసీలో సంగీత వ్యాఖ్యాతగా విస్పరింగ్ బాబ్ హారిస్‌గా పేరొందిన రాబర్ట్ బ్రిన్లీ జోసెఫ్ హారిస్ 1946 ఏప్రిల్ 11న జన్మించారు. అమెరికానా మ్యూజిక్ అసోసియేషన్ సమర్పించే కార్యక్రమంలో 50ఏళ్లపాటు సేవలందించి శ్రోతలను అలరించారు. 'టైమ్ అవుట్' అనే పత్రిక సంస్థాపకులు. యూకే హెరిటేజ్ అవార్డు, మోజో మెడల్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2011లో ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ (ఓబీఈ) గౌరవం, 2017లో సీఎంఏ ఇంటర్నేషనల్ బ్రాడ్‌కాస్టర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం అందుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

ఆంజనేయా.. నమోనమః!

● ఘనంగా చిలకలనేర్పు హనుమంతుడి రథోత్సవం

చేళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చిలకలనేర్పు గ్రామంలో వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి ఆలయ ఉత్సవాలలో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా జరిగింది. సీతారామలక్ష్మణ సమేతంగా ఆంజనేయస్వామిని రథంపై అలంకరించిన రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. సాధారణంగా చైత్రమాసంలో ఏటా విశేష ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 8న ప్రారంభమైన ఉత్సవాలు 14వరకు కొనసాగనున్నాయి. ఆలయ ధర్మకర్త సంజీవప్ప నేతృత్వంలో గ్రామస్థుల సహకారంతో రథోత్సవం నిర్వహించారు. అర్చకులు విజయకుమార్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

అహింసతో విశ్వశాంతిని కాంక్షించిన మహావీరుడు

● జయంతి సభలో జైన గురువులు ● నగరంలో భారీ ఊరేగింపు... మహిళల బైక్ ర్యాలీ




మంత్రి దినేష్‌గుండురావ్‌ను సత్కరిస్తున్న జైన ప్రముఖులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భగవాన్ మహావీర్ అహింసా సిద్ధాంతం ద్వారా విశ్వశాంతిని ఆకాంక్షించారని జైన గురువులు అభిప్రాయపడ్డారు. మహావీర్ 2624వ జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలో పలు కార్యక్రమాలు సాగాయి. జైన్ యువజన సంఘటన అధ్యక్షులు జైన్ మహావీర్ మున్నోత్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. శాంతియుత సమాజం కోసం మహావీర్ జీవిత కాలం పాటుపడ్డారని పలువురు అభిప్రాయపడ్డారు. టౌన్‌హాల్ నుంచి మహిళల బైక్ ర్యాలీతో పాటు ప్రత్యేక ఊరేగింపు జరిగింది.



మహావీరుడికి అభిషేకం..

అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి దినేష్ గుండూరావ్, ఎంపీలు పీసీ మోహన్, లెహర్‌సింగ్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. జైన్ యువసంఘటన ఉపాధ్యక్షులు ముకేష్‌సురానా, కార్యదర్శి నీరజ్ కఠారియా, జాయింట్ సెక్రటరీ సుశాంత్ చెలవాట్, కోశాధికారి సంతోష్‌దుంగర్‌వాల్‌తో పాటు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు అసాధ్యం

● శిరలో జిల్లాస్థాయి మాత్రమే సాధ్యం: మంత్రి ఎంబీ పాటిల్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా శిరా పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం అసాధ్యమని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి ఎంబీ పాటిల్ తేల్చి చెప్పారు. గురువారం బెంగళూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ శిరాలో జిల్లాస్థాయి విమానాశ్రయం నిర్మించవచ్చును కానీ అంతర్జాతీయ విమానాశ్రయం సాధ్యం కాదన్నారు. రెండురోజులుగా రెండోవిమానాశ్రయం నిర్మాణాలకు సర్వే జరుగుతున్న తరుణంలోనే పలు అంశాలపై వివరణ ఇచ్చారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు కనకపుర పరిధిలోని హారోహళ్ళి, నెలమంగళ పరిధిలోని కుణిగల్ ప్రదేశాలను పరిశీలించారన్నారు. ఇటీవల 35 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి శిరా ప్రాంతంలో విమానాశ్రయ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరిన విషయమై మాట్లాడుతూ హోంమంత్రి పరమేశ్వర్, సీనియర్ ఎమ్మెల్యే టీబీ జయచంద్రలు శిరాలో విమానాశ్రయం గురించి ప్రస్తావించారని కానీ అక్కడ నిర్మాణాలకు అనుకూలం కాదన్నారు. అధికారులు నిర్ణయించిన ప్రదేశానికే తాము అంగీకరిస్తామన్నారు. విమానాశ్రయ నిర్మాణం ఒకేసారి జరుగుతుందని వేల కోట్లు పెట్టుబడి అవసరంగా ఉంటుందన్నారు. అందుకు తగిన వాతావరణంతో పాటు వ్యాపార కోణం కూడా కీలకం కానుందన్నారు. విజయపుర నా సొంత జిల్లా అయినందున నాకు మా జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉన్నా అది సాధ్యం కాదన్నారు. కాగా శిరా ప్రాంతంలో విమానాశ్రయం కోసం కేంద్రమంత్రి సోమణ్ణ కూడా ప్రస్తావించారన్నారు.



ప్రమాదానికి గురైన కారు

డివైడర్‌ను ఢీకొన్న కారు.. నలుగురి మృతి

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి తుమకూరుకు కారులో వెళుతుండగా దాబాస్‌పేట వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. బెంగళూరు నగరం మల్లేశ్వరంకు చెందిన వారు తుమకూరులో బంధువుల ఇంట నామకరణం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. గురువారం జరిగిన ప్రమాదంలో గోపాల్(60), శశికళా(55), దీపికా(35) కారుడ్రైవర్ గోపాల్(45)లు దుర్మరణం చెందిన వారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరు చిన్నారులు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బెంగళూరు గ్రామీణ ఎస్పీ సీకే బాబా ప్రమాద స్థలాన్ని సందర్శించారు. దాబాస్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు..

హోసూరు క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతిచెందారు. శానభోగనపల్లి స్కూల్ సమీపాన చోటు చేసుకున్న ఘటనలో పవన్ (20), ప్రీతం (21) మృతిచెందారు. గురువారం ఉదయం సుమారు 9 గంటలకు తళి నుంచి శానభోగనపల్లికి అన్నదమ్ము ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులతో వెళ్తున్న టెంపోట్రావెలర్‌ను ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే సాధ్యం కాక టెంపోను ఢీ కొన్నఘటనలో అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న తళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం డెంకణీకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం మిగిలింది.

రాహుల్, ప్రియాంక అలానే గెలిచారా..?

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవీఎం)లతో ఎన్నికల్లో మోసం చేశారని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత సీటీ రవి తీవ్రంగా స్పందించారు. ఈమేరకు గురువారం ఎక్స్ ద్వారా పలు ప్రశ్నలు సంధించారు. ఈవీఎంలు మహామోసమంటూ వ్యాఖ్యానిస్తున్న ఖర్గే కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యద్భావం తద్భవతీ అనే సామెతలాగా మీ అల్లుడు రాధాకృష్ణ, కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంకగాంధీ, అధినాయకుడు రాహుల్‌గాంధీ కూడా అలానే మోసంతోనే గెలిచారా అని ప్రశ్నించారు. తమిళనాడులో డీఎంకె, కేరళలో కమ్యూనిస్టులు, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ, కర్ణాటకలో కాంగ్రెస్‌లు ఈవీఎంల ద్వారానే మోసం చేశారా అంటూ నిలదీశారు. ఐఎన్‌డీఐఏ కూటమి పార్టీలు విజయానికి అదే కారణమని చెప్పగలరా అంటూ ప్రశ్నించారు.

రాజ్‌భవన్‌ను దారితప్పించే కుట్ర

● ప్రతిపక్షాల విమర్శలపై మండిపడ్డ సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గనుల లైసెన్స్‌ల మంజూరు, రెన్యూవల్ విషయంలో గందరగోళం సృష్టించేందుకు దుష్టశక్తులు రాజభవన్‌ను దారితప్పించే కుట్ర పన్నుతున్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. గురువారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎనిమిది కంపెనీలకు గనుల తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన విషయమై సామాజిక కార్యకర్త రామమూర్తిగౌడ ఇటీవల గవర్నర్‌ను కలిసి వినతి ఇచ్చారన్నారు. గనుల లైసెన్స్‌లు మంజూరు విషయమై ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి నప్పటినుంచి జరుగుతోందన్నారు. 2015కు ముందు 20 ఏళ్ళకు గాను పొందిన అనుమతులు అస్థిత్వంలో ఉన్న సమయంలోనే రెన్యూవల్ కోసం ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం నిబంధనలకు అనుగుణంగా అనమతులు ఇచ్చామన్నారు. ఏడు కంపెనీల్లో రెండు కంపెనీలు శాసనబద్ధంగా వివరాలు తెలుపనందున అనుమతులు ఇవ్వలేదు. మిగిలిన వాటిలో మూడింటిని బీజేపీ అధికారంలో ఉన్న సందర్భంగా 2020-2021లో కాంట్రాక్టు హక్కును ఇచ్చామ న్నారు. తాము మంజూరు చేసిన అనుమతుల ద్వారా ప్రభుత్వానికి పైసా కూడా నష్టం లేదన్నారు. గతంలోను ప్రతిపక్షాలతో పాటు పలువురు వివిధ సంస్థలలో ఫిర్యాదు చేశాయన్నారు. సమగ్ర ఆధారాలతో ప్రభుత్వానికి నష్టం కానీ లేదా కిక్ బ్యాక్ కానీ నిరూపించాలని డిమాండ్ చేశారు.

పీయూలో రాణించిన సెయింట్ ఫిలోమినా విద్యార్థులు



విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) :జ్ఞానభారతి మరియప్పన పాళ్యలోని సెయింట్ ఫిలోమినా విద్యార్థులు ద్వితీయ పీయూ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించారు. ఇటీవలే ద్వితీయ పీయూ ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. సైన్స్ విభాగంలో జిషనుకుమార్ 98.5శాతం, లిఖిత్‌చంద్ర 98శాతం, యశ్వంత్ 97.33, లక్షిత్ జె గోయల్ 97శాతం, కామర్స్ విభాగంలో కీర్తన ఆర్ ఎం 95.16శాతం, ధనుష్ హెచ్ 94.33 శాతం సాధించారు 70మంది వి విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ప్రకటించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, కార్యదర్శి, ప్రిన్సిపాల్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

ల్యాబ్‌లతో వేగంగా వ్యాధి నిర్ధారణ

● గ్రామీణ ఎంపీ, ప్రముఖ వైద్యుడు సీఎన్ మంజునాథ్



క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మంజునాథ్

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక ల్యాబ్‌ల అందుబాటులో ఉండటం ద్వారా వేగవంతంగా వ్యాధి నిర్ధారణ సాధ్యమని బెంగళూరు గ్రామీణ ఎంపీ, ప్రముఖ వైద్యుడు సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. గురువారం ట్రస్ట్‌వెల్ ఆసుపత్రిలో క్యాథ్‌ల్యాబ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బెంగళూరులో అత్యాధునిక క్యాథరైజేషన్ ల్యాబ్‌ను నగర నడిబొడ్డున ఉండే ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. బెంగళూరు ప్రజలు గుండె సంబంధిత జబ్బులపై అవగాహన పొందుతున్నారన్నారు. హృదయంతో పాటు నరాలకు సంబంధించిన పరీక్షలలో స్పష్టత కలిగిన వివరాలు క్యాథ్‌ల్యాబ్ ద్వారా సాధ్యమన్నారు. ట్రస్ట్‌వెల్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌వి మధుసూధన్ మాట్లాడుతూ.. కొత్త ల్యాబ్ ద్వారా రోగులకు నరాలకు సంబంధించిన చికిత్సలకు అనకూలం కానుందన్నారు. అత్యాధునిక సాంకేతిక విధానంతో హృదయ సంబంధిత బాధితులకు సమస్యను గుర్తించి చికిత్సలు చేసేందుకు అనుకూలం కానుందన్నారు.



మ్యాచ్ తిలకిస్తున్న సీఎం సిద్దరామయ్య

నగరంలో ఐపీఎల్ సందడి

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఐపీఎల్ మ్యాచ్ సందడి నెలకొంది. నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో గురువారం రాత్రి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), ఢిల్లీ కేపిటల్స్ (డీసీ) జట్ల మధ్య ఉత్సాహంగా సాగింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్వయంగా స్టేడియంను సందర్శించి మ్యాచ్‌ను వీక్షించారు. సీఎం వెంట మంత్రులు బైరతి సురేశ్, రాజణ్ణ తదితరులు ఉన్నారు. చిన్నస్వామి స్టేడియం వద్ద అభిమానులు ఆర్‌సీబీకి మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా అభిమానులు, ప్రజలకోసం నమ్మ మెట్రో రైలు సేవలను కొద్దిసమయం పొడిగించారు.



స్టేడియంలో అభిమానుల సందడి

చీనీ టన్ను రూ. 23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,100 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4,150, సరాసరి రూ.14వేలు పలికినట్లు తెలిపారు.

కార్మికుల సంతోషం కోసమే క్రికెట్ టోర్నీ

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నందన గ్రూపు హోటల్స్ ద్వారా వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని వారు సంతోషం, ఉల్లాసంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే క్రికెట్ టోర్నీ జరిపినట్లు నందన వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ఆర్ రవిచందర్ తెలిపారు. 18వ విడత నందన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో నందన టైటాన్ జట్టు విజేతగా నిలువగా రన్నర్స్‌గా నందన లెజెండ్ సాధ్యం చేసుకుంది. పోటీలకు 18 జట్లు పోటీ పడ్డాయి. నగర వ్యాప్తంగా ఉండే నందన గ్రూపు హోటల్ ఉద్యోగులందరూ టోర్నీలో పాల్గొన్నారు. విజేత జట్టుకు బహుమతిని ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీకే ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెటర్లతో రవిచందర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.15	1,579.12
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3009	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,800	232
నీటి నిల్వ (టీఎంసీలు)	7.42	4.06

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు గాలం

● ఆన్‌లైన్‌లో రూ.18 లక్షలు స్వాహా

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసం గురించి రోజూ అప్రమత్తం చేసే సందేశాలతో జాగృతం చేస్తున్నా... నిత్యం మోసపోయే వారి సంఖ్య అధికంగా ఉంది. నిరక్ష్య రాస్యులకంటే అక్షరాస్యులే ఆన్‌లైన్ మోసాల బారిన పడుతుండడం గమనార్హం. బళ్ళారి నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.లక్షల్లో పోగొట్టుకుని లబోదిబోమంటున్నాడు. ఈ మధ్యనే పేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన చూసిన సాప్ట్‌వేర్ ఇంజనీయర్ దానిని క్లిక్ చేసి వాట్స్‌గ్రూప్‌లో చేరాడు. అక్కడి ఆన్‌లైన్‌లో జరిగే షేర్‌మార్కెట్ వ్యవహారాలతో డిపాజిట్ చేస్తే అధిక లాభాలు పొందవచ్చనే సైబర్ నేరగాళ్ళ మాటలు నమ్మిన విడతల వారీగా ఏకంగా రూ.18.55 వేలు ఇన్వెస్ట్ చేశాడు. ఆఖరికి తాను మోసపోయానని తెలుసుకున్న ఆ వ్యక్తి చేసేది లేక నగరంలోని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు సైబర్ పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

పోలీసులపై దాడికి యత్నం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని జంబునాథ్ రోడ్డులో బుధవారం రాత్రి ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన నిందితుడు హంచ్చకాళి కాలిపై కాల్పులు జరిపిన సంఘటన గురువారం తెల్లవారుజామున నగర శివార్లలోని మహాదేవ ఇండస్ట్రీస్ సమీపంలో జరిగింది. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో నిందితుడు హంచ్చకాళి పోలీసులపై దాడికి ప్రయత్నించారు, హొస్పేట్ టౌన్ పోలీస్ స్టేషన్ పీఐ, దర్యాప్తు అధికారి హులుగప్ప నిందితుడి కాలిపై కాల్చాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు. దాడిలో హొస్పేట్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ లింగరాజ్, కానిస్టేబుల్ కొట్రేశ్ గాయపడ్డారు. ఎస్పీ శ్రీహరిబాబు, ఏఎస్పీ సలీం పాషా, డివైఎస్పీ మంజునాథ్ తల్వార్ పోలీసులను కలిసి పరామర్శించారు.

అరటిచెట్లు దగ్ధం

కంప్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా పరిధిలోని విఠ్లాపుర గ్రామంలో బుధవారం సాయంత్రం అరటిచెట్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బసవనగౌడ పొలంలో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ఏర్పడి అరటిపంట పూర్తిగా కాలి బూడిదైంది. ఎకరా పొలంలో సుమారు 450 నుండి 500 మొక్కలు కాలిబూడిదయ్యాయి. చేతికొచ్చిన పంటలు ఇలా కాలిబూడిద కావడంతో రైతు లబోదిబోమన్నారు. రూ.2 లక్షలుపైగా నష్టం వాటిల్లిందనీ, ఆదుకోవాలని రైతు కోరాడు.



కాలిబూడిదైన అరటి చెట్లు

ఘనంగా మహావీర్ జయంతి



మహావీరుడికి పూలమాలలు వేసి పూజిస్తున్న మేయర్ నందీష్



కంప్లిలో ఊరేగింపులో పాల్గొన్న జైనసమాజ ప్రముఖులు

బళ్లారి సిటీ/రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి కేవలం మతపరమైన పండుగ కాదు, కరుణ, నైతికత, అహింసను చాటిచెప్పే రోజని మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. గురువారం నగరంలోని తేరువీధి రోడ్డులోని పార్శ్వనాథ్ భవన్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవాన్ మహావీర్ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహావీరుడు 30 సంవత్సరాల వయస్సులో జ్ఞానోదయం కోసం తన విలాసవంతమైన జీవితాన్ని వదులుకున్నాడని, స్వీయ క్రమశిక్షతో విశ్వశాంతి సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపన్యాసంలో సాధ్వాజీ సూర్యప్రభ శ్రీజీ మాట్లాడుతూ జైనమతం యొక్క 24వ తీర్థంకురుడు భగవాన్ మహావీరుడు చిన్న వయసులోనే సన్యాసం స్వీకరించారన్నారు. ఈకార్యక్రమంలో బళ్లారికి చెందిన సుధ బృందం మహీవీరుడిపై గీతాలు, జైన సమాజానికి చెందిన పిల్లల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జయంతిలో భాగంగా నగరంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీ పార్శ్వనాథ్ భవన్ నుంచి ప్రారంభమైన ఊరుగింపు తేరు వీధి, కాళమ్మ వీధి, బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ మీదుగా నిర్వహించారు.

కంప్లి : కంప్లి పట్టణంలో జైన సమాజం ఆధ్వర్యంలో మహావీర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహావీర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైన సమాజం పదాధికారులు పాల్గొన్నారు.

సిరుగుప్ప : మహావీర అహింసో పరమోధర్మః అని చాటిచెప్పిన ఏకైక వ్యక్తి అని బీసీ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లికార్జున అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహావీర భావ చిత్రపటానికి పూజలు జరిపి ఆయన వేడుకలను జరుపుకున్నారు. ఆయన తత్వసిద్దాంతాలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. వర్దమాన్ మహావీర్ చరిత్ర ఎంతో వుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సమాజ సేవకులు అబ్దుల్ నబీ, బీసీ సంక్షేమశాఖ వార్డెన్లు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు చిన్నారుల మృతి

బళ్లారిరూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. బళ్లారి తాలుకా పరిధిలోని సిడిగినమల గ్రామంలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో దేవమ్మ కుమారుడు శివశంకర్ (12), మస్తానప్ప కుమారుడు రాజశేఖర్ (11) వీరిద్దరూ మరో ఇద్దరు స్నేహితులు గ్రామ సమీపంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. దాహంగా వుండటంతో సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో ఖుషి హోండా నీటి గుంతలో నీరు తాగేందుకు వెళ్లి నీటిగుంతలో పడ్డారు. ఈత రాకపోవడంతో వారిద్దరూ నీళ్లలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకుని పరిశీలించగా అప్పటికే ఇద్దరూ మృత్యువాత పడ్డారు. రూరల్ డీఎస్పీ వెంకటేష్, సీఐ రుద్రప్ప, ఎస్ఐ నాగభూషణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం చిన్నారుల మృతదేహాలను విమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. చిన్నారుల మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కపూట బడి కావడంతో సరదాగా గడిపేవారని తల్లిదండ్రులు వాపోయారు.

20న గొల్ల సంఘ శతాబ్ది ఉత్సవాలు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర గొల్ల (యాదవ్) సంఘం శతాబ్ది ఉత్సవాలను, యాదవానంద స్వామి 16వ పట్టాభిషేక కార్యక్రమాన్ని ఏప్రిల్ 20న బెల్గాం జిల్లా చిక్కోడిలోని జిల్లా స్టేడియంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సాయంత్రం నగరంలోని యాదవ్ సంఘం జిల్లాకార్యలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.బెల్గాం ప్రాంతంలో ఈ సంఘం ఒక సమావేశాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. జాతీయ స్థాయి నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రజలు వస్తారు. సుమారు 50వేల మంది హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు విట్టల్ యాదవ్, రాష్ట్ర సంఘం ఆఫీసు బేరర్లు, జిల్లాధ్యక్షుడు గాదె పాల్గొన్నారు. మాజీ అధ్యక్షుడు తిమ్మప్ప యాదవ్ చంద్రప్ప , ఆశాలత, తిమ్మారెడ్డి యాదవ్,అసోసియేషన్ సభ్యుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

● ఆనెగొంది ప్రాంతంలో ఇప్పటి వరకు 8 చిరుతల పట్టివేత



బోనులో చిరుత

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా పరిధిలోని ఆనెగొంది సమీపంలోని తళవార ఘట్ట వద్ద ఆశ్రయ కాలనీ వైపు వస్తున్న చిరుతను అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో మంగళవారం రాత్రి చిక్కింది. సుమారు నాలుగేళ్ళ మగ చిరుత ఆరోగ్యంగా ఉందని, బోనులో పడిన అనంతరం తప్పించుకునే ప్రయత్నంలో ముక్కుకు గాయమైనట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. హోలిహర్ష్ పాఠశాల వద్ద చిరుత సంచరిస్తున్నట్లు వ్యవసాయ పనులకు వెళ్ళే రైతులు భయాందోళన చెందారు. విషయాన్ని గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ సిబ్బంది చిరుతను పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేశారు. చిరుత బోనులో పడిన విషయం నిర్ధారించుకున్న గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బోనువద్దకు చేరుకున్న అధికారులు పై అధికారుల సూచనల మేరకు బోనులో పడిన చిరుతను అటవీ ప్రాంతంలో వదిలి వేయనున్నట్లు తాలూకా అటవీ సంరక్షణ అధికారి సుభాష్ చంద్ర నాయక్ తెలిపారు. ఆనెగొంది పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 8 చిరుతలను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

హజ్ యాత్రికులు నిబంధనలు పాటించాలి : ఎంపీ

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీ తుకారామ్ అన్నారు. రాష్ట్ర హజ్ కమిటి ఆధ్వర్యంలో గురువారం ఆరు జిల్లాల హజ్ యాత్రికులకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. హజ్‌యాత్రకు వెళ్లేవారు ధర్మగురువురులు చెప్పినట్లుగా మునుష్య ధరాన్ని పాటించాలని, నిత్యం సత్యానికి కట్టుబడి ఉండడం తదితర ధర్మాన్ని పాటించాలన్నారు. సభలో వక్ఫ్ చట్టం వ్యతిరేకంగా లోక్‌సభలో మాట్లాడాలని కోరగా, ఇప్పటికే వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఓటు వేశానన్నారు. అనంతరం హుడా అధ్యక్షుడు హెచ్.ఎన్.ఎఫ్. అహ్మద్ ఇమాజ్ నియాజీ హజ్ కమిటీ మాజీ అధ్యక్షుడు దాదా సాహెబ్, మున్సిల్ కౌన్సిల్ సభ్యుడు అస్లాం మల్గీ, అజుమన్ ఇకమిటి అన్సార్ భాషా, డాక్టర్ దుర్వేష్, ఫిరోజ్ ఖాన్, లాయర్ మోహిసీన్, గులాం రసూల్, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బళ్ళారి, విజయనగర జిల్లాలతో పాటు రాయచూరు, కొప్పళ, గదగ్, చిత్రదుర్గ జిల్లాల నుంచి హజ్ యాత్రికులు తరలి వచ్చారు.

ద్వితీయ పీయూ ఫలితాల్లో సత్తాచాటిన సర్ ఎంవీ కళాశాల



నందన రాహుల్ జయలక్ష్మి సాక్షి అదితి నూతన హర్షిణి ప్రజ్వల్



అనన్య సంజన ప్రియదర్శిని కుషి ప్రగతి సోహాసిద్దిక్ పర్వేజ్ నిషాఎలిగర్ తృప్తి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూ ఫలితాల్లో దావణగేరె సర్ ఎంవీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని ఆదితి వీరేశ్ అంగడి సైన్స్ విభాగంలో 600 మార్కులుకు గాను 597మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధిచారు. దావణగేరె జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని అలాగే వాణిజ్య విభాగంలో సాక్షి కే.ఎల్. 593మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని సంస్థ యాజమాన్యం సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలోని సైన్స్ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాహుల్, జయలక్ష్మి 595మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. నందన్ 594 మార్కులు సాధించి మూడవస్థానంలో నిలిచారు. అలాగే తమ కాలేజ్‌కు చిందిన 16మంది విద్యార్థులు 590మార్కులు సాధించారు. ఇనిస్టిట్యూట్‌లోని విద్యార్థులందరూ నీట్,జేఈఈ, సీఈటీ శిక్షణ పొంది అపూర్వమైన ఫలితాలు సాధించగలరని ఆశిస్తున్నాం.సైన్స్ విభాగంలో అనన్య 593మార్కులు, హర్షిణి 593, ప్రజ్వల్ 593, నూతన 592, సంజన 592, ప్రగతి 591, ప్రియదర్శిని 591, గురుప్రసాద్ 590, నిశా ఎలిగర్ 590, సోహసిద్దిక్ పర్వేజ్ 590, తృప్తి పాటిల్ 590 మార్కులు సాధించారు. సుమారు 257మంది విద్యార్థులు గణితం, సైన్స్ ,కన్నడ, సాంస్కృతం, 100కి 100 మార్కులు సాధించి తమ కళాశాలకు వన్నె తెచ్చారని పేర్కొన్నారు. సంస్థలోని 897 విద్యార్థులు డిస్టింక్షన్, 673మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైయారని మొత్తం 99.3శాతం ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. విద్యార్థులను సంస్థ కార్యదర్శి శ్రీధర్, సురేశ్ కుమార్, ప్రిన్సిపల్ సిబ్బంది అభినందించారు.

ఎస్‌జీటీ కళాశాల విద్యార్థులు..

నగరంలోని ఎస్‌జీటీ పీయూ కాలేజీ విద్యార్థులు ద్వితీయ పీయూ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ రుద్రప్ప తెలిపారు. 20 మంది విద్యార్థులు డిస్టింక్షన్ 90మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి, 80మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైయ్యారు. వాణిజ్య విభాగంలో విజయశ్రీ 600మార్కులకు గాను 585మార్కులు, వైదర్శన్ 576, ఆర్, రాజేశ్వరీ 570, సంజయ్‌కుమార్ 568, తనూజ 558, సైన్స్ విభాగంలో సానికా 554, పవన్ 546, మాన్సీ 545 మార్కులు సాధించారు. విద్యార్థులను చైర్మన్ రుద్రప్ప, కార్యదర్శి నాగరాజు, ప్రిన్సిపల్ శారద, డైరెక్టర్ మంజుల, అధ్యాపకులు కృష్ణప్ప, చందన, కవిత, శారద, శశిధర్ గౌడ్, మంజుళ,రాజేశ్, అర్పితా,మేఘరాజ్,హిరేమఠ్, అరుణాపాటిల్, స్నేహ, షమీ అహమ్మద్,పరుశురాం అభినందించారు.



సానిక పవన్ మాన్సీ రాజేశ్వరి సంజయ్‌కుమార్ తనూజా విజయశ్రీ దర్శన్

విశ్వజ్యోతి పీయూ కళాశాల విద్యార్థులు

ద్వితీయ పీయూ ఫలితాల్లో సిరుగుప్ప విశ్వజ్యోతి పీయూ కళాశాల విద్యార్థులు సైన్స్,వాణిజ్యంలో అత్యధిక మార్కులు సాధించారు. అఖిల్ కుమార్ 600మార్కులకు గాను 592మార్కులు సాధించి రాష్ట్రంలో 8వ ర్యాంక్,బళ్లారి జిల్లాలో ప్రథమ స్థానాన్ని సాదిస్తూ ,రసాయన శాస్త్రంలో 100కి 100మార్కులు సాధించారు. ఎం.కావ్యశ్రీ 581మార్కులు సాధించి తాలూకాలో ప్రథమ స్థానాన్ని కలేజ్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. బసమ్మ 569 మార్కులు, మనోహర్ 562, మధుమతి 549మార్కులు సాధించారు. వాణిజ్య విభాగంలో జాహ్నవి 600మార్కులకు గాను 573, హారతి కుమారి 568, వైష్ణవి 567 మార్కులు సాధించారు.ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు విశ్వజ్యోతి అధ్యక్షులైన బసలింగప్ప, నిర్దేశకులు వివేకానంద, ప్రిన్సిపల్ శివప్రకాశ్, అధ్యాపకులు, సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ బసలింగప్ప

విజయభేరి మోగించిన శ్రీ చైతన్య విద్యార్థులు



లిఖిత.టిఎ నేహ.ఎస్ తరుణ్.కెఎస్ డింపల్ కుమారి సృష్టి సంగమేష్ అమృత ఫయాజ్ ఉమామహేశ్వర రెడ్డి

బళ్ళారి గాంధీనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ద్వితీయ పీయూ ఫలితాల్లో నగరానికి చెందిన శ్రీ చైతన్య పియు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయ భేరి మోగించినట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించడంతో కళాశాల కీర్తిని రెంట్టింపు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఫలితాల్లో 600మంది డిస్టింక్షన్‌లు సాధించగా, ఫస్ట్‌క్లాస్ 1527, సెకెండ్ క్లాస్‌లో 435, తృతీయ శ్రేణిలో 39మంది ఉత్తీర్ణత సాధించారు. ఉపన్యాసకులకు, తల్లితండ్రులకు శ్రీ చైతన్య మండలి డైరెక్టర్ డాక్టర్ పి.రాధాకృష్ణ అభినందనలు తెలియజేశారు.



పుష్పలత.ఎం నందకుమార్

విశిష్ట ఫలితాలు సాధించిన 'వశిష్ట'



అకీఫా.ఆర్ కె.ఉదా కె.నందిని భాగ్య శ్వేత.జి కేదార్ చిన్మయ్ ఖాశీం వలి త్రివేణీ రెడ్డి ఔచిత్య

ఈ ఏడాది జరిగిన ద్వితీయ పీయూ పరీక్షల్లో బళ్ళారి నగరానికి చెందిన వశిష్ట పీయూ కళాశాల విద్యార్థు విశిష్టమైన ఫలితాలు సాధించి కళాశాల కీర్తిని పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పియు ఫలితాల్లో కళాశాలకు చెందిన 110 మంది డిక్టంక్షన్ సాధించగా, ఫస్ట్‌క్లాస్ 123, సెకెండ్ క్లాస్‌లో 12మంది ఉత్తీర్ణత కాగా, 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిలో ఆర్.అకీఫా 600 మార్కులకు గాను 577 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలవగా, కె.ఉదా 572, కె.నందిని భాగ్య 568, శ్వేతాజీ 565, కేందర్ చిన్మయి.పి 564, ఖాశీం వలి.ఎస్ 564, డి. త్రివేణి రెడ్డి 563, ఔచీత్యాడి 563, ఎన్. ఇంచర, 562, రియా పర్శురాం పరూరై 561, వెంటిగన అనాన్య సాయి 561 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యుతమ సాధనకు కారణమైన కళాశాల ఉపన్యాసకులకు, ప్రోత్సహించిన తల్లితండ్రులకు, అధ్యాపక బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



ఎన్.ఇంచర రియా అనన్యసాయి

హొసూరు జోన్

వైభవంగా రథోత్సవాలు

● డెంకణీకోటలో బేటరాయస్వామి..
గోపసంద్రలో వేంకటేశ్వరస్వామి..



డెంకణీకోట బేటరాయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హొసూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హొసూరు సమీపంలోని డెంకణీకోట, గోపసంద్రలో గురువారం రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. కృష్ణగిరి జిల్లా డెంకణీకోటలో వెయ్యేళ్ల చరిత్ర కల్గిన సౌందర్యవల్లి సమేత బేటరాయస్వామి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. రథోత్సవ కమిటీ చైర్మన్ టీఆర్ శ్రీనివాసన్, కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, హొసూరు ఎమ్మెల్యే ప్రకాశ్, తళి ఎమ్మెల్యే రామచంద్రన్, హొసూరు మేయర్ సత్య సహా స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామస్మరణతో రథోత్సవం సాగింది. రథంపై అరటింపడ్లు, ఉప్పు వేసి మొక్కులు తీర్చుకున్నారు. డెంకణీకోట, హొసూరు, తళి, కెలమంగలం, సరిహద్దులోని కర్ణాటకకు చెందిన భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు నీరు, మజ్జిగ పంపిణీతోపాటు అన్నసంతర్పణ చేశారు.

గోపసంద్రలో...

గోపసంద్రలో సుమారు 600 సంవత్సరాల పురాతనమైన వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. స్థానికంగా దక్షిణ తిరుపతిగా పిలుస్తారు. ఆలయ వార్షిక ఉత్సవాలలో భాగంగా స్వామివారి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం సాగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగాలు నిర్వహించారు. శూలగిరి, హొసూరు, ఉత్తనపల్లి, సరిహద్దులోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.



రథోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాశ్, కలెక్టర్ దినేష్ కుమార్



గోపసంద్ర శ్రీవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు